

అమెరి'కా'లేజ్

- లిపి మల్లాది



అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో.. అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..

- సంపాదకుడు

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

ఉదయం లేవగానే వెంటనే లాబ్‌కి వెళ్ళాను. ప్రెజెంటేషన్‌కి బాగా ప్రిపేర్ అయ్యాను. కానీ లాబ్ వారి ముందు ప్రాక్టీస్ సెషన్‌కి చాలా భయపడ్డాను. ఇది కనిపెట్టి ప్రొఫెసర్ నా భయాన్ని పోగొట్టే ప్రయత్నం చేసారు. కానీ గుండెల్లో దడ మాత్రం తగ్గలేదు. గొంతు వణికినా అందరికీ అర్థమయ్యింది. అందరూ ధైర్యం చెప్పే ప్రయత్నం చేసారు. అది బాగా సహాయపడింది. అలా రెండు మూడుసార్లు ప్రాక్టీస్ చేసాక అలవాటయ్యి భయం తగ్గింది. అందరూ సహకరించి మరింత ప్రాక్టీస్ చెయ్యమనడంతో ఎంతో ఆనందంగా అనిపించింది. ఆ తరవాత నెమ్మదిగా ప్రశ్నలు మొదలయ్యాయి. సమాధానం తెలిసినవి వెంటనే బదులు చెప్పి, తెలియని వాటికి తడబడ్డాను. సమాధానం తెలిసినా, తెలియక పోయినా, ప్రెజంటేషన్‌కి ఎంత నెమ్మదిగా మాట్లాడానో అంతే నెమ్మదిగా మాట్లాడాలని ప్రొఫెసర్ బోధించారు. అలా ప్రశ్నలు కొంతసేపు చర్చించి అందులో కూడా ప్రవీణత వచ్చేంత వరకు అందరూ ఓపికగా కూర్చున్నారు. ఇంతలో లంచ్‌కి టైం అవ్వడంతో అందరూ

వెళ్ళిపోసాగారు. ప్రొఫెసర్ వెంట తన ఆఫీసు వైపుకి నడుస్తూ నేను ఇంత సమయం వృధా చేసినందుకు క్షమార్పణలు చెప్పాను. ఆయన నవ్వి 'ఇంతకన్నా ఎక్కువ సమయం తీసుకున్న వారిని చూసాను, ఇదేమీ నాకు కొత్తకాదు. నీకు నాలెడ్జ్ వుంది కానీ దాన్ని వ్యక్తపరచడం రావట్లేదు. కానీ రేపటి మెయిన్ ప్రెజెంటేషన్‌కి తయారుగా ఉన్నావు' అని చెప్పారు. ఆ తరవాత నాకోసం మధ్యాహ్నం వరకు ఓపిక పట్టిన వారందరికీ థాంక్స్ చెప్పి లాబ్‌నుండి బయలుదేరాను. కేవలం నాలుగు గంటలే అయినా ఓ రోజంతా పని చేసినట్లుగా అనిపించడంతో వెంటనే నిద్రపోయాను. లేచేసరికి రాత్రా, పగలా అర్థంకాక కొన్ని నిముషాలు ఫోన్ కోసం వెతికి టైం చూసాను. రాత్రి ఎనిమిదైంది. వెన్నెల డిన్నర్‌కి వస్తావా అని దాదాపు గంట క్రితం మెసేజ్ చేసింది .

వెంటనే ఫోన్ చేసి "ఇప్పుడే లేస్తున్నా మెసేజ్ చూడదేదు. సారీ" అన్నాను.

"నీ గొంతు వింటే అర్థమౌతుంది. తినేసావా పడుకునే ముందు?" అడిగింది.

"లేదు. మధ్యాహ్నం లంచ్ టైంకి పడుకున్నాను చాలా అలసిపోయి."

"అయితే వచ్చేయి. నేను ఇప్పుడే తినబోతున్నాను."

"సరే. టెన్‌మినిట్స్‌లో ఉంటా అక్కడ."

ఫోన్ పెట్టి, కాస్త తయారయ్యి వెళ్ళాను.

"నువ్వు రావేమో అని నేను వంట చెయ్యలేదు. ఇప్పుడే చేద్దాం అని ఉల్లిపాయలు కోస్తున్నాను. అరగంటలో వంట అయిపోతుంది" అంది.

"అయ్యో వద్దు. ముందే చెప్పాల్సింది కదా. ఏం కాదు వెన్నెల" అన్నాను.

"ఇంట్లో ఏం లేదు. నేను చపాతి, పెరుగు ఇంక పచ్చడి తిందాం అనుకున్నాను."

"నేనూ అదే తింటా నాకూ ఇష్టమే" నిజానికి చపాతీని పెరుగుతో ఎప్పుడూ తినకపోయినా వెన్నెలకి అనవసరంగా పనెందుకు అనుకున్నాను.

"పక్కానా?" అడిగింది.

తలాడించాను.

వెన్నెల చపాతీలు వేడి చేస్తుండగా ఉదయం ప్రెజంటేషన్‌లో జరిగిన సంగతులన్నీ చెప్పాను. వెన్నెల తెగ నవ్వింది. దాంతో నాకూ చాలానవ్వొచ్చింది. నవ్వాపుకున్నాక, "సారీ కావాలని నవ్వట్లేదు" అంటూ మళ్ళీ నవ్వింది.

"ఫరవాలేదు" అని నేనూ నవ్వసాగాను.

"నా ఫస్ట్ ప్రజంటేషన్ అంతకన్నా ఘోరంగా జరిగింది. నేను మొదలు పెట్టగానే ఎవరో నవ్వారు. దాంతో నేను ఏడ్చేసా" అంది.

అది విని నేను పెద్దగా నవ్వాను. నాతోపాటు తనుకూడా నవ్వింది. నవ్వుతూనే మిగతా కథ చెప్పడంతో నాకు ఒక్క ముక్క అర్థం కాలేదు కానీ నవ్వు ఆగలేదు. నిజానికి ఎంతో ధైర్యంగా, ఎప్పుడూ నవ్వుతూ కష్టపడే వెన్నెల ఒకప్పుడు అలా ఏడ్చిందంటే నమ్మలేకపోయాను. నిజమే చెప్తున్నావా అని అడిగితే, 'నిజమే. నేను ఒకప్పుడు చాలా భయపడేదాన్ని ' అంది.

ఇద్దరం కలిసి తినడానికి కూర్చున్నాము. నేను చపాతీని పచ్చడిలో ముంచి, పెరుగులో ముంచి నోట్లో పెట్టుకున్నాను. అస్సలు బాలేకపోయినా బయటకి చెప్పలేదు.

"అయ్యో, అలాకాదు పిల్లా నువ్వు ఎప్పుడూ తినలేదా?" అడిగింది.

"లేదు. ఇలాకాదా?" ఆశ్చర్యపోయాను.

"ఆగు ఉల్లిపాయలు కూడా తెస్తా" కిచెన్‌లోకి వెళ్ళింది.

ఈలోగా లాప్‌టాప్‌లో ఏదైనా పెడదామని యూట్యూబ్ తెరిచాను. తన సజెషన్స్‌లో జయలలిత ముఖం కనపడింది. పాత సినిమా కాబోలు అని నొక్కాను. కానీ అది ఇంటర్వ్యూ. కొన్ని క్షణాలకి దాన్ని మూసేసాను. వెన్నెల ఉల్లిపాయ ముక్కలు నా పళ్ళెంలో వేస్తూ,

"నీకు కూడా అలాంటి ఇంటర్వ్యూలు ఇష్టమా?" అడిగింది.

"నేను ఎప్పుడూ చూడలేదు" అన్నాను.

"జయలలిత చాలా స్ట్రాంగ్ లేడీ. ఏన్ ఇన్స్పిరేషన్" అంటూ ఏదో వీడియో పెట్టింది. అనవసరంగా అడిగాను. ఇప్పుడు ఈ బోరింగ్ ఇంటర్వ్యూ వింటూ తినాలా అని బాధపడుతూ "ఇంతకి ఎలా తినాలి?" అడిగాను.

"అయ్యో మర్చేపోయానురో" అంటూ పెరుగుని పచ్చడిలో కలిపేసింది. నేను ఆశ్చర్యపోయాను. తను నావంక చూడ్డంతో నేనూ అలాగే కలిపాను కానీ తినలేనని అర్థమైంది. తను నా వంక చూడ్డంతో తినాల్సి వచ్చింది. "ఉల్లిపాయతో బావుంటుంది" అనడంతో ఓ ముక్క కొరికాను. అనుకున్నంత విచిత్రంగా కాకుండా రుచికరంగా వుండడంతో ఆశ్చర్యంగా 'బాగుంది' అన్నాను. అది అర్థమైనట్టు చిన్నగా నవ్వింది.

"నాకు ఎగ్జామ్స్ వున్నప్పుడు వంట చెయ్యడానికి టైం వుండేది కాదు. అప్పుడు మేము చపాతీ వేడి చేసి, పెరుగులో గ్రీన్ చిల్లీ పచ్చడి కలిపి తినేవాళ్ళం. ఓ రకంగా అది పంజాబీ డిష్. వాళ్ళు అచార్, దహీతో పరాఠాలు తింటారు" తలూపాను.

వేగంగా తినేసి ఇంటికి వెళ్దాం అనుకున్నాను కానీ చూసే కొద్దీ ఆ ఇంటర్వ్యూ ఎంతో ఆకట్టుకుంది. జయలలిత మాట్లాడిన తీరు వాళ్ళ అమ్మ చనిపోయాక ప్రొడ్యూసర్లు తక్కువ డబ్బు ఇవ్వడం, తనకి చదవాలని ఉన్నా సినిమాల్లోకి రావడం వంటివి ఎంతో హత్తుకున్నాయి. తను మాట్లడుతున్నంతసేపు వింటూనే ఉండాలనిపించింది. ఇంటర్వ్యూలో అడిగిన ఒక్క ప్రశ్న 'మీ బయోగ్రఫీని' సినిమాగా తీసే మీ కారెక్టర్ ఎవరు చెయ్యాలనుకుంటున్నారు?"

తను ఇచ్చిన ఆన్సర్ 'ఐశ్వర్యరాయ్ '.

ఇంటర్వ్యూ పూర్తయ్యాక వెన్నెల 'ఇద్దరు' సినిమా గురించి చెప్పడంతో అది చూడ్డం మొదలు పెట్టాము. తమిళనాడు పాలిటిక్స్ గురించి నాకు అంతదాకా ఏమీ తెలీదు. ఇంటర్వ్యూ ఈ సినిమా విడుదలైన్ రెండేళ్ళకి అయ్యింది కాబట్టి, బహుశా సినిమా చూసాక ఐశ్వర్యరాయ్ తనలాగా బాగా నటించిందనుకుంది అనుకున్నారు. అలా సినిమా చూస్తూ అక్కడే నిద్రపోయి, ఉదయం వెన్నెల ఆఫీసుకి వెళ్ళేప్పుడు లేపితే లేచాను. టైం ఏడున్నర అయింది. తను వెళుతూ నన్ను రూం దగ్గర దింపేయడంతో నిద్రమత్తుతోనే గదిలోకి వెళ్ళాను.

ఆ తరవాత ఫోన్ వాళ్ళ ఇంట్లో మరిచిపోయానని గుర్తొచ్చి మత్తు వదిలింది. గబగబా తయారయ్యి లాబ్‌కి వెళ్ళాను. ఫోన్ లేకపోవడంతో సమయం తెలియదని గదిలో కాలక్షేపం చెయ్యలేదు. నాన్నగారు వాచి పెట్టుకోవడం అలవాటు చేసుకో అని పదే పదే ఎందుకన్నారో ఇప్పుడు అర్థమైంది. లాబ్‌లో గోడగడియారం చూస్తే ఎనిమిదిన్నర అని తెలిసింది. తొమ్మిదింటికి రెయిన్ వచ్చింది. నిన్న నేను కుంభకర్ణిలా పడుకున్న సంగతి ఎప్పాను. ప్రెజంటేషన్ సంభాషణ వచ్చి 'యు లుక్ రిలాక్స్డ్' అంది. నిన్నటి ప్రాక్టీస్ తరవాత ధైర్యం వచ్చింది అన్నాను.

వెన్నల మొదటిసారి నా స్థానంలో ఉన్నప్పుడు ఏడవడంతో నాకు ఆత్మవిశ్వాసం పెరిగిందని చెప్పాను. నిన్న తను అడిగిన ప్రశ్నలని ప్రొఫెసరే అడగమన్నారని చెప్పింది. ఆశ్చర్యపోయాను. 'మిగతా వారు ఎలాంటి ప్రశ్నలు అడుగుతారో అంచనా వేసి ఆ ప్రశ్నలని ఇలాంటి ప్రాక్టీస్ సెషన్‌లో అడిగించి ప్రిపేర్ అయ్యేలా చేస్తారు. నీది మొదటిసారి కాబట్టి నీకు తెలీదని చెబుతున్నాను' అంది. ఆయన సహకరణకి కళ్ళల్లో నీరు తిరిగాయి. చివరికి ప్రెజంటేషన్ టైం వచ్చింది. గదిలో తెలియని వారు పాతికపైనే ఉన్నారు. దాంతో గుండెల్లో దడ మొదలైంది. అది పసిగట్టినట్టు మా ప్రొఫెసర్ 'ఆ విని, లెట్స్ బిగిన్' అని ధైర్యం చెప్తున్నట్టు నవ్వారు.

నిన్న ప్రాక్టీస్‌లానే అన్నీ నెమ్మదిగా వివరించాను. ఆయన అంచనా వేసిన ప్రశ్నలే చాలావరకు అడిగారు. ఒక ఇద్దరు అడిగిన ప్రశ్నలకి నాకు సమాధానం తెలియక పోవడంతో ప్రొఫెసర్ వైపుకి చూస్తే ఆయన బదులిచ్చారు. ఆ తరవాత డిపార్ట్‌మెంట్ వాళ్ళు తెచ్చిన పిజ్జాని లంచ్‌కి తింటూ అందరం మా ప్రాజెక్ట్‌ల గురించి చర్చించుకున్నాము. కొందరు అండర్ గ్రాడ్యుయేట్లు, కొందరు మాస్టర్స్ స్టూడెంట్స్, మరికొందరు పి.హెచ్.డీ చేస్తున్నవారు. మన ఇండియాలోలాగా కాక అందరూ సమానంగా అన్నింట్లో పాలుపంచుకోవడం ముచ్చటేసింది. వారిలో అనుల అనే శ్రీలంక అమ్మాయి, గాయత్రి అనే తెలుగు అమ్మాయి పరిచయమయ్యారు. అవని అంటే 'భూమి' అని చెప్పాను.

'అనుల అంటే ఒకప్పుడు శ్రీలంకలోని రాణి అని, ఆవిడే లంక నుండి బౌద్ధం పుచ్చుకున్న మొదటి స్త్రీ' అని అనుల చెప్పింది.

అలా పేర్ల గురించి, భాష గురించి మాట్లాడుతు మా మధ్య స్నేహం కలిసింది. అనుల వెళ్ళిపోయాక కూడా నేను, గాయత్రి మాట్లాడూకుంటూ బయటకి నడవసాగాము. నేను ప్రెజంటేషన్ చాలా బాగా చెప్పానని, అందరికీ బాగా అర్థమయ్యిందని అంది. నిన్న ప్రొఫెసర్ పడ్డ కుస్తీ గురించి చెప్పి, రాత్రి చూసిన ఇంటర్వ్యూ ప్రభావం కూడా కాస్త ఉందని నెమ్మదిగా, నిదానంగా మాట్లాడ్డం జయలలిత, సిమిగర్‌వాల్ ఇంటర్వ్యూ నుండి నేర్చుకున్నాన్నని చెప్పాను. తనుకూడా చూస్తానని చెప్పి, నా ఫోన్ నంబర్ తీసుకుని క్లాసుకి వెళ్ళింది.

నేను మా ప్రొఫెసర్‌కి థాంక్స్ చెప్పి లైబ్రరీలో జయలలిత గురించి పుస్తకాలు ఉన్నాయేమో చూద్దాం అని అటువైపుకి వెళ్ళాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS